క్లుప్తంగా

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ

కొయ్యూరు: మండలంలోని గన్నెర్లపాలెం, కాట్రగెడ్డ, తీగలమెట్ట, శరభన్నపాలెం, నడింపాలెం, కినపర్తి, వెలగలపాలెం ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో విజయకుమారి శనివారం సందర్శించారు. రికార్డులు, సరకులను పరిశీలించారు. లబ్ధిదారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ కేంద్రాన్ని సకాలంలో విధిగా తెరవాలని సూచించారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని సూచించారు.

గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశం రేపు

గంగవరం: ఏటిపల్లి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ నాయకుడు తోట రాజేశ్వరరావు, పార్టీ మండల ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

28న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వివరాలు తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

అరకులోయ రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 28న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందజేయాలి



జెడ్పీటీసీ బేబీరత్నం

గంగవరం : సూరంపాలెం ఎంపీపీ ప్రాథమిక పాఠశాలను జెడ్పీటీసీ బేబీరత్నం శనివారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్నం భోజన పథకం గురించి హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఉచిత టైలరింగ్ సెంటర్‌ను పరిశీలించి మహిళలతో మాట్లాడారు.

సందడిగా ఫేర్‌వెల్



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో శుక్రవారం రాత్రి ఫేర్‌వెల్ పార్టీ సందడిగా సాగింది. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇంటర్ సీనియర్ విద్యార్థులకు జూనియర్లు వీడ్కోలు పలికారు. ప్రిన్సిపాల్ రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు విందు ఏర్పాటుచేసింది.

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య స్కూల్‌లో 6,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైనట్టు ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న రాత పరీక్ష జరుగుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రంపచోడవరం డివిజన్‌లో(ఐటీడీఏ పరిధిలో) వై.రామవరం మండలం పి.యర్రగొండ, మారేడిమిల్లి, చింతూరు, రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం గ్రామాల్లో ఆరు ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా 27వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివారలకు 9490876026 కు సంప్రదించాలని ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు.

సిరులు కురిపిస్తున్న పిప్పళ్లు

- ఆశాజనకంగా ధరలు
- కిలో రూ.300 నుంచి రూ.350కు కొనుగోలు
- ఆనందంలో గిరిజన రైతులు



సంతలో పిప్పళ్ల కొనుగోలు

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో అరుదుగా లభించే ఔషధ గుణం కలిగిన పిప్పళ్ల సాగు ఈ ఏడాది గిరిజన రైతులకు కలిసొచ్చింది. ఆశించిన మేర దిగుబడి ఉండడంతో గిరిజన రైతులకు లాభాలను అందిస్తోంది.ముఖ్యంగా ఆయుర్వేద సంస్థలు వాటి ఉత్పత్తుల తయారీకి ఈ వేర్లను వినియోగిస్తుండడంతో పిప్పళ్లకు మంచి గిరాకీ ఉంది. ఇతర వాణిజ్య పంటలతో పోలిస్తే పిప్పళ్లు లాభదాయకంగా ఉండడంతో గిరిజన రైతులు పిప్పళ్ల సాగుపై మొగ్గు చూపుతున్నారు. గతంలో మూడేళ్లకు, ఐదేళ్లకు మాత్రమే పిప్పళ్ల సాగును గిరిజనులు చేసేవారు, ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్‌తో ప్రతి ఏడాది పిప్పళ్ల సాగును చేస్తున్నారు. చల్లటి వాతావరణం కలిగిన గిరిజన ప్రాంతంలో మాత్రమే పిప్పళ్ల సాగును గిరిజన రైతులు సాగు చేస్తున్నారు.

సంతల్లో జోరుగా విక్రయాలు

గిరిజన ప్రాంతాల్లో వారపు సంతల్లో పిప్పళ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వ్యాపారులు కిలో రూ.300 నుంచి రూ.350 వరకు రకం బట్టి కొనుగోలు చేయడంతో గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ప్రారంభంలో 250 నుంచి 280 వరకు మాత్రమే ధర ఉంటే ఈ ఏడాది ధరలో 20 నుంచి 70 వరకు వ్యత్యసం ఉండడం రానున్న రోజుల్లో ధర మరింత పలుకుతుందని గిరిజన రైతులు ఆశాభావంలో ఉన్నారు 2019 సంవత్సరంలో 140 రూపాయలకు మాత్రమే కొనుగోలు చేసే పిప్పళ్లను గత నాలుగు సంవత్సరాల్లో సగానికి పైగా పెరడగంతో రైతులు పిప్పళ్ల సాగు పట్ల పూర్తిగా దృష్టి సారించారు. ప్రస్తుతం పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, జి.మాడుగుల మండలాల్లో జరుగుతున్న వారపు సంతల్లో పిప్పళ్ల అమ్మకాలు, కొనుగోలు జోరుగా జరుగుతోంది. ఈ ఏడాది వరి, రాజ్‌మా పంటలతో పాటు పసుపు, పిప్పళ్ల పంటలు కూడా ఆశాజనకంగా ఉండడంతో గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది



ముంచంగిపుట్టు వారపు సంతలో పిప్పళ్ల అధిక ధరకు కొనుగోలు చేయడం చాలా ఆనందంగా ఉంది. ధర ఇలా పెరిగితే వచ్చే ఏడాది పిప్పళ్ల సాగు మరింత విస్తీర్ణం పెంచుతాను. ప్రతి వారపు సంతలోను మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు అధికంగా వచ్చి పిప్పళ్లు కొనుగోలు చేస్తున్నారు. మంచి రకం పిప్పళ్లు గిరిజన సంతలో లభ్యమవుతున్నాయి.

– వి.రాజేశ్వరరావు, గిరిజన రైతు, సుజనపేట గ్రామం, ముంచంగిపుట్టు మండలం

చట్టాలపై అవగాహన అవసరం



అరకులోయలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ దేముడుబాబు



రావణాపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ స్వామినాయుడు



అడ్డతీగలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ రాంబాబు



జీకే వీధిలోని కేజీబీవీలో అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌కుమార్

అరకులోయ రూరల్/కొయ్యూరు/జీకే వీధి/ అడ్డతీగల: ఏజెన్సీలో అన్ని ప్రాంతాల్లోని విద్యాలయాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోక్సోచట్టం, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, బాలిక చట్టాలపై శనివారం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా అరకులోయ, కొయ్యూరు, గూడెం కొత్తవీధి, అడ్డతీగల ప్రాంతాల్లోని కాలేజీలు, ఆశ్రమ పాఠశాలల్లోజరిగిన కార్యక్రమాల్లో ఆయా ప్రాంత సీఐలు జి.దేముడుబాబు, స్వామినాయుడు, అశోక్‌కుమార్, వై.రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లు, ఐటీ, పోక్సో చట్టాలు, చైల్డ్ పోర్నోగ్రఫీ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. అరకులోయలో ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి, కొయ్యూరులో హెచ్‌ఎం మృదుభాషిణి, జీకే వీధిలో ఎస్‌ఐ అప్పలసూరి, సచివాలయ మహిళా పోలీసు శాంతి, అడ్డతీగలలో ఏటీడబ్ల్యూవో హసిని, ఐసీడీఎస్ సిడిపిఓ దీప్తి, ఎస్‌ఐలు అప్పలరాజు, లతాశ్రీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యపై దృష్టి సారించాలి

పాడేరురూరల్/దుంబ్రిగుడ/పెదబయలు/చింతపల్లి/రాజవొమ్మంగి/గంగవరం/అనంతగిరి/: పాడేరు, దుంబ్రిగుడ, అనంతగిరి, పెదబయలు, చింతపల్లి, రాజవొమ్మంగి, గంగవరం ప్రాంతాల్లోని విద్యాలయాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు దిశ, ఇతరత్రా చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయా ప్రాంతాల్లో ఎస్‌ఐలు లక్ష్మణరావు, సంతోష్‌కుమార్, పి.మనోజ్‌కుమార్, సాయికుమార్, షరీఫ్, నరేంద్రప్రసాద్, చినబాబు, అనంతగిరిలో ఏఎస్‌ఐ రాజంనాయుడు మాట్లాడుతూ ఉన్నత విద్యపై దృష్టి సారించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: మాదల పంచాయతీ తోటవలస గ్రామానికి చెందిన సచివాలయం కన్వీనర్ కొర్రా ప్రేమలత తనయుడు కొర్రా ప్రకాష్‌పాల్(20) గత కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పార్టీ శ్రేణులతో కలిసి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వైస్ ఎంపీపీ రామన్న, మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, మాజీ సర్పంచ్ సన్యాసిరావు, సచివాలయం కన్వీనర్ శెట్టి గోపాల్, నాయకులు సాంబ, నర్సింగ్, రంజిత్‌కుమార్, నాగేశ్వరరావు, గురుమూర్తి, రామరావు తదితరులున్నారు.

సీతంరాజు సుధాకర్ గెలుపునకు కృషి



హుకుంపేటలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం, నాయకులు



లగిశపల్లిలో పట్టభద్రులకు కరపత్రాన్ని అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, నేతలు

పెదబయలు/హుకుంపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా పనిచేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పిలుపునిచ్చారు. మండలంలో ఆయన శనివారం పర్యటించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్ గెలుపునకు మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరావు, వైస్ ఎంపిపి రాజుబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేష్‌కుమార్, సర్పంచ్ కృష్ణారావు, నాయకులు ఉమామహేశ్వరరావు, గంగాభవాని, సూర్యనారాయణ, సూరయ్య, సింహాచలం, కృష్ణారావు, లక్ష్మణరావు, అనంతరావు, కొండలరావు,అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. హుకుంపేట మండల కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శనివారం పర్యటించారు. ఈ మేరకు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు చినసత్యం,యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తిబాబు,సర్పంచ్‌లు సాంబ, చిన్నారావు, చిన్నయ్య, సుబ్బారావు, వెంకట్, లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, భీమలింగేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ భూషణ్, నాయకులు రమేష్, కామరాజు, లక్ష్మయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుధాకర్ గెలుపు కోరుతూ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి శనివారం గుత్తులపుట్టు, లగిశపల్లి పంచాయతీలలో ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరిగిన ఎమ్మెల్యే పట్టభద్రులతో మాట్లాడారు. గిరిజనుల సమస్యలపై మంచి అవగాహన ఉండడంతో పాటు గిరిజనులతో మమేకమైన సీతంరాజు సుధాకర్‌కే పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఎంపీటీసీ లకే రామకృష్ణపాత్రుడు, సర్పంచ్ లకే పార్వతమ్మ, నాయకులు సత్యనారాయణ, కొట్టగుళ్లి చిన్ని, సుశీల, కొట్టగుళ్లి నాగేంద్ర, కొట్టగుళ్లి కొండాజీ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు/గూడెంకొత్తవీధి/ముంచంగిపుట్టు/దుంబ్రిగుడ: కొయ్యూరు నడింపాలెం, పెదమాకవరం, శరభన్నపాలెం ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలలను ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాజులమ్మ తదితరులు పర్యటించి, ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు బాబులు, మండల కన్వీనర్ సుధాకర్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, సర్పంచ్ సత్యనారాయణ, నేతలు శేఖర్, రాజుబాబు, గంగాధర్, వనంబాబు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు. జీకే వీధిలో మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్, సర్పంచ్ నాగులమ్మ, వైస్ ఎంపీపీ దేముడు తదితరులు పాల్గొన్నారు.ముంచంగిపుట్టులో ఎంపీపీ సీతమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, అరకు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, సర్పంచ్‌లు గంగాధర్, రమేష్, నీలకంఠం, నేతలు జగబందు,అప్పారావు, గాసిరావు, తిరుపతి,రాంప్రసాద్, అర్జున్,పులిరాజు,జయదేవ్,దాసు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దుంబ్రిగుడలో వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, సర్పంచ్ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ జగ్గనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం తీరుపై ధ్వజం



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ జయశ్రీ

అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయతీ దేవరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాడి రమేష్ శనివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల హెచ్‌ఎం రామన్న విధులు సక్రమంగా నిర్వహించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు వెల్ఫేర్ అసిస్టెంట్ జయశ్రీతో సందర్శించినట్టు చెప్పారు. హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి బోధన, మెనూ అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. సుమారు 70 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని, హెచ్‌ఎం మాత్రం సక్రమంగా విధులు హాజరు కావడం లేనట్టు తెలిసిందన్నారు. దీనిపై హెచ్‌ఎంను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అడిగితే దురుసుగా సమాధానం చెబుతున్నట్టు స్థానికులు చెప్పారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి హెచ్‌ఎంపై చర్యల తీసుకోవాలన్నారు. ఈ విషయంపై గ్రామస్తులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు రామ్మూర్తి, గోపాల్, గురు, హరి తదితరులున్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



నిట్టపుట్టులో బెల్లం తయారీ రైతులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ మత్స్యలింగం తదితరులు

హుకుంపేట: మండలంలోని దుర్గం పంచాయతీ నిట్టపుట్టులో జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం సందర్శించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చెరకు పంట సాగు, బెల్లం తయారీ చేస్తున్న గిరిజన రైతులతో మాట్లాడారు. గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందన్నారు. గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. వ్యవసాయ పంటలతో పాటు చెరుకు పంట సాగు, బెల్లం తయారీ చేస్తు ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. చెరకు ధరలు, బెల్లం కొనుగోలుపై ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పార్టీ యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, ఎంపిటీసీ సభ్యుడు సాంబ, సర్పంచ్ సుబ్బారావు, నాయకులు అప్పలస్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ అవసరం



యువకులకు శిక్షణ ఇస్తున్న కళ్యాణ్

గంగవరం : యువకులు శరీర ధారుఢ్యాన్ని పెంపొందించుకోవాలంటే నిత్యం నడక, క్రీడలు ఆడడం, యోగా వంటి చేయాలని పోలీసు ఉద్యోగి కలుముల కళ్యాణ్ అన్నారు. పోలీసు శాఖలో హెచ్‌సీగా పనిచేస్తున్న గంగవరం గ్రామానికి చెందిన కలుముల కళ్యాణ్‌దొర ప్రతీ శని, ఆదివారాల్లో స్థానిక గిరిజన యువతకు ఫిట్‌నెస్‌పై శిక్షణ ఇస్తుంటారు. పోలీసు శాఖలో ఉద్యోగానికి ఫిట్‌నెస్ ఎంతో అవసరమని గిరిజన యువకులను ప్రోత్సాహిస్తున్నారు.

నాసిరకం సరకులు విక్రయిస్తే చర్యలు



సంతలో తనిఖీలు నిర్వహిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం వారపు సంతను మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్ సందర్శించి, దుకాణాల్లో రికార్డులు, కాటాలు తనిఖీలు చేశారు. ధరల పట్టికలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాసిరకం సరకులు విక్రయించినా, తూకంలో మోసాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కిరాణా దుకాణాలను పరిశీలించి, సరుకుల, వస్తువుల నాణ్యతను పరిశీలించారు. ఐఎస్‌ఐ మార్క్ లేని వస్తువులను గుర్తించి, ఇకపై అలాంటివి విక్రయించొద్దని వ్యాపారులకు సూచించారు. కొనుగోలుదారుడుకి నాణ్యమైన సరకులు ఎమ్మార్పీకే విక్రయించాలని, ప్రతి వస్తువుకు బిల్లు తప్పకుండా ఇవ్వాలన్నారు. ధరల పట్టికలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ప్రజా ఆరోగ్యానికి హాని కలిగించే కల్తీ సరకులు విక్రయిస్తే దుకాణదారుడి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, నాయకులు జగబందు, రాంప్రసాద్, తిరుపతి, దామోధరం, జయదేవ్, తిరుపతిరావు, గాసిరావు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సుబ్బారావు

దుంబ్రిగుడ: గొర్రెలు,మేకలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి రాజశ్రీ అన్నారు. ఆమె ఆదేశాల మేరకు కితలంగి పంచాయతీలో గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలో 923–మేకలకు, 1202–గొర్రెలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేశారు. వైద్యాధికారి రాజశ్రీ మాట్లాడుతూ పశు వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.వ్యాధులు సంభవించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వ్యాక్సిన్ వేయాలని సూచించారు. పంచాయతీలో జరిగిన వ్యాక్సిన్ కార్యక్రమాన్ని సర్పంచ్ సుబ్బారావు పర్యవేక్షించారు. సిబ్బంది ఆనంత్‌రావు, త్రినాథరావు,సంజీవ్, మహేష్, జానకి, రాజు, జయరాజు, మహేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవం

కశింకోట: మండలంలోని మోసయ్యపేట శివారు గోకివానిపాలెంలో షిర్డీ సాయిబాబా, వరసిద్ధి వినాయకుని ఆలయాల వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు రౌతు చిరంజీవి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

శారదానగర్‌లో..

అనకాపల్లి రూరల్: స్థానిక శారదానగర్ బాల వినాయక దేవాలయం 40వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీ డాక్టర్ సత్యవతమ్మ, విష్ణుమూర్తి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎంపీ దంపతులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. జగన్, మురళీకృష్ణ, సత్యనారాయణరావు, సాంబశివరావు, అప్పారావు, మోహన్‌రావు ,ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

మునగపాక : మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ లక్ష్మణరావు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు.

గ్రామాల్లో బోర్లకు మరమ్మతులు



బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వీఆర్ పురం: రానున్న వేసవిలో జీడిగుప్ప పంచాయతీ పరిధిలోని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా బోర్లకు మరమ్మతులు చేస్తున్నట్టు సర్పంచ్ మూట్ల బాలరాజు చెప్పారు. పంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మగండి, భీమవరం, జీడిగుప్ప, రాయిగుడెం, కోటారిగొమ్మ, దారపల్లి, ములకపల్లి గ్రామాల్లోని బోర్లకు యంత్రంతో శనివారం ఫ్లెషింగ్ చేయించారు. మొత్తం ఎనిమిది బోర్లకు ఫ్లెషింగ్ చేయించి మరమ్మతులు చేయించినట్టు ఆయన చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పొడియం గోపాల్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, ఎస్సీ సెల్ నాయకులు మాచర్ల వెంగళరావు, చీమల కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అమ్మవారి జాతర ఉత్సవాలు

చింతపల్లి: మండలంలోని తాజంగిలో ఆదివారం నుంచి దొంతులమ్మ జాతర మహోత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. బుధవారం వరకు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. గిరిజనులు ఈ జాతరను ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

ఉత్సవ ప్రత్యేకత

తొలిరోజు ఆదివారం ఆలయం వద్ద పూజ లు, భజన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. జాతర సందర్భంగా తొలి రోజు నుంచి సీతారాములు, లక్ష్మణుడు, భరత, శత్రఘ్నుడు వేషధారణలో ఐదుగురు చిన్నారులు ఆలయానికి సమీపంలోని ఒక గుహ వద్ద ఉపవాసంతో పూజలు నిర్వహిస్తారు. ఉత్సవం ముగి సే వరకు వారు ఇళ్లకు వెళ్లకుండా గుహ వద్దే ఉంటారు. వీరి బాగోగులను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తారు.మూడవ రోజు మంగళవారం రామడోలి పేరిట వారిని ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం వద్ద భారీ ఎత్తులో ఏర్పాటు చేసిన ఊయలలో ఊగిస్తారు. వేడుకకు పలు ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.